తేదీ 24.02.2006, సాయికుల్వంత్ హాలు

# ఆధ్యాత్మికత తోడైనప్పడే భౌతిక విద్యకు సార్థకత

**ఎమ్మేలు బియ్యేలు ఏర్పడ చదివియు**
**పేరుగాంచిన పెద్దవారలైన**
**సంపదలుండియు సద్దానపరులైన**
**పుడమి కీర్తిని గన్న పుణ్యులైన**
**ఆయురారోగ్యంబు లనవరతంబుండి**
**పరిపూర్ణ బలులగువారలైన**
**సతతంబు జపములు చాలంగ చేయుచు**
**వేదములను నేర్చు విప్రులైన**
**సాటిరారు భక్తులకు ఏనాటికైన**
**దైవమును కొల్వనిదె రాదు దండి భక్తి**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు?**
**సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!**

ఆధ్యాత్మిక తత్త్వమును విస్మరించి భౌతిక విద్యలు ఎన్ని నేర్చినను ప్రయోజనముండదు. కాని, ఈనాటి మానవుడు కేవలం భౌతిక విద్యలను అభ్యసించి పొట్టకూటి నిమిత్తమై, కుటుంబ పోషణార్థమై పాటుపడుతున్నాడు. ఈనాడు సంసారముకూడా ఒక పెద్ద సమస్యగా మారిపోయింది. చిన్న పిల్లవానిని స్కూలులో చేర్చాలంటే ఇరవై వేలో, ముప్పై వేలో ఫీజు అడుగుతున్నారు. ఎక్కడికి వెళ్ళినసూ, ఏమి చేసిననూ అందరూ కేవలం

srisathyasaivachanamrutam

డబ్బుకోసమే పాటుపడుతున్నారు. విదేశాలకు వెళ్ళి డబ్బు సంపాదించడమే విద్యార్థుల ధ్యేయంగా ఉంటున్నది. మానవుడు ధనం నిమిత్తమై పాటుపడుతున్నాడేగాని తానెవరు? తన తత్త్వమేమిటి? తన జన్మమేమిటి? గమ్యమేమిటి? అనే విషయాలను గుర్తించడం లేదు. తన జీవిత లక్ష్యాన్ని విస్మరించి ప్రపంచము నిమిత్తం అనేకవిధాలుగా పాటుపడుతున్నాడు. మానవుడు ఎన్ని మాటలాడినను, ఎన్ని పాటలు పాడినను, ఎన్ని విద్యలు నేర్చినను, ఎన్ని ఉపన్యాసములిచ్చినను తానెవరనేది తెలుసుకొనకపోతే ప్రయోజనమేమిటి? ఈనాడు గొప్పగొప్ప సైంటిస్టులు కూడా కేవలం పేరుప్రతిష్ఠల నిమిత్తమై పాటుపడుతున్నారేగాని, ప్రపంచ శ్రేయస్సుకై పాటుపడడం లేదు. Science without spirituality is useless. ఆధ్యాత్మికత లేని సైన్సువలన ప్రయోజనం లేదు. ఒక గొప్ప సైంటిస్టు ఉండేవాడు. అతను మందుసామాను తయారు చేశాడు. అది ఎందరినో కాల్చి భస్మం చేసింది. అది చూసి అతను, 'అయ్యో, నావల్లనే కదా ఇంత ప్రమాదం జరిగింది' అని విచారంతో క్రుంగిపోయి కట్టకడపటికి పిచ్చిపట్టినట్లయిపోయి కొంతకాలము పిచ్చాసుపత్రిలో ఉండవలసి వచ్చింది. మరొక సైంటిస్టు తన ప్రక్క యింట్లో ఉన్న ఐదు సంవత్సరాల బిడ్డకు పాఠాలు చెప్పేవాడు. అర్థంకాని పదాలనుపయోగించి ఆ బిడ్డ మనసును చెడగొట్టాడు. అతను చెప్పేవన్నీ విని ఆ బిడ్డ మతిచెడిపోయింది.

**'సైన్స్'తోపాటు 'సెన్స్' చాలా అవసరం**

సాధారణంగా సైంటిస్టులు గొప్ప విషయాలను తెలుసుకుంటారుగాని చిన్న చిన్న విషయాలను గమనించరు. న్యూటన్ గొప్ప సైంటిస్టు. అతను ఎంతో ప్రీతిగా ఒక పిల్లిని పెంచేవాడు. అతను తలుపు వేసుకొని పరిశోధనలో నిమగ్నుడై ఉన్న సమయంలో ఆ పిల్లి బయట తలుపుదగ్గర నిలబడి అరుస్తూ అతని ఏకాగ్రతకు భంగం కలిగించేది. అందుచేత, అది లోపలికి రావడానికి, పోవడానికి వీలుగా న్యూటన్ తలుపుకు ఒక రంధ్రం చేయించాడు. కొంతకాలానికి ఆ పిల్లికి రెండు పిల్లలు పుట్టాయి. అప్పుడాయన మళ్ళీ వడ్రంగిని పిలిచి, పిల్లి పిల్లలకోసం తలుపుకు మరో రెండు రంధ్రాలు చేయమన్నాడు. అప్పుడా వడ్రంగి, 'సార్! అవి రావడానికికూడా ఉన్న ఒక రంధ్రము చాలు. ఒకదాని తరువాత ఒకటి రావచ్చు', అన్నాడు. ఒక పామరునికి కూడా తెలిసిన విషయం గొప్ప



sri sathyasai vachanamrutam

సైంటిస్టుకి తెలియదు! దశరథునికి ఎంతమంది కుమారులంటే ఒక్కడే కుమారుడన్నాడు, ఓ సైంటిస్టు. ఎవరు? అని అడిగితే రాముల పేరు చెప్పాడు. లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల పేర్లు ఆయనకు తెలియవు. 'మీరు ఇంత పెద్దవారై ఉండి దశరథుని కుమారుల పేర్లు చెప్పలేకపోతున్నారే', అంటే, 'ఈ పేర్లతో పనేముంది?' అన్నాడు. కాని, తనకు మాత్రం గొప్ప పేరు రావాలని ఆశించాడు. ఈనాటి చదువులు మనిషిని ఉన్నత స్థాయికి గొనిపోవుటకు బదులు అల్పస్థాయికి దిగజార్చుతున్నాయి. మానవుడు గొప్ప సైంటిస్టుగా పేరొందుతున్నాడుగాని, 'సెన్స్' (వివేకము) లేకుండా ప్రవర్తిస్తున్నాడు. "ఇహమున సుఖియింప హేమతారక విద్య, పరమున సుఖియింప బ్రహ్మవిద్య" బ్రహ్మవిద్య నేర్చినవానికి అన్నీ ప్రాప్తిస్తాయి. నిత్యజీవితంలో  తాను చేయవలసిన పనులు చేస్తాడు; చూడవలసిన దృశ్యాలను చూస్తాడు; అనుభవించవలసిన ఆనందాన్ని అనుభవిస్తాడు. చీమకూడా బ్రహ్మ స్వరూపమేననీ, పరమాణువునందు ఏ శక్తి ఉన్నదో పరమాత్మయందు కూడా అదే శక్తి ఉన్నదనే సత్యాన్ని గుర్తిస్తాడు.

**'చావులేని చదువు చదువవలయు'**

ఈనాటి విద్యార్థులు ఉద్యోగాల నిమిత్తమై కష్టపడి చదివి అనేక డిగ్రీలు పొందుతున్నారు. కాని, ఎంతో కష్టపడి చదివి ఎన్ని పరీక్షలు పాసైనప్పటికీ అంత్య సమయంలో ఆ డిగ్రీ సర్టిఫికెటు ఏమాత్రం ఆదుకోదు. 'చదువులన్నియు చదివి చావంగ నేటికి? చావులేని చదువు చదువవలయు'. భౌతికమైన చదువుతోపాటు ఆధ్యాత్మిక విద్యకూడా నేర్చుకోవాలి. భౌతిక విద్యలు – నెగెటివ్. ఆధ్యాత్మిక విద్య – పాజిటివ్. అదే చాలా ముఖ్యమైనది. భౌతిక విద్యలన్నీ బల్బులవంటివి. వాటిని ప్రకాశింపజేసే కరెంటే ఆధ్యాత్మిక విద్య. గాలిచ్చే ఫ్యాను, వంట చేసుకునే స్టౌ – వీటన్నింటికీ కరెంటే కదా ప్రధానం. కరెంటు లేకపోతే ఇవేవీ పని చేయలేవు. అదేరీతిగా, ఆధ్యాత్మిక విద్య లేకపోతే లౌకిక విద్యలన్నీ నిరుపయోగమైపోతాయి. ప్రతి వ్యక్తియందు ఆత్మతత్త్వమనే కరెంటు ఉంది. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించడమే నిజమైన విద్య. అయితే, నీవు లౌకికమైన చదువులు చదువకూడదని నేను చెప్పడం లేదు. వీటితోపాటు అంతర్ముఖమైన ఆత్మవిద్యనుకూడా అభ్యసించాలి. అప్పుడే నీవు చదివిన చదువులు సార్థకమవుతాయి. నీవు ఒక విషయాన్నిగురించి పుస్తకంలో చదివిన తరువాతనే

sri sathyasaivachanamrutam

దానికి సంబంధించిన ప్రశ్నకు జవాబు చెప్పగలవు. వినకుండా, చదవకుండా ఏమీ చెప్పలేవు. నీవు చదివిన చదువు ఒక చిన్న చీమనైనా కదిలించగలదా? 'చదువులు నేర్చితినంచు గర్వ మేల?' ఇలాంటి చదువే ప్రధానమని భావించి కాలమును వ్యర్థం చేయవద్దు.

### భగవత్తత్త్వమును ఎవ్వరూ వర్ణించలేరు

మొట్టమొదట నీ పంచేంద్రియాలను సరియైన విధముగా ఉపయోగపెట్టుకో. అప్పుడు నీకంటే గొప్పవాడు లేడు; నీకంటే వేరు దేవుడు లేడు. ఇంద్రియ తత్త్వాన్నిగురించి లోతుగా విచారించి, నీ నిజస్వరూపాన్ని గుర్తించుకోవడానికి ప్రయత్నించు. నీవు దేవాలయమునకు వెళ్లినప్పుడు దేవతా ప్రతిమ ఎదురుగా నిలబడి కన్నులు మూసుకొని ధ్యానము చేస్తావు. దీని అంతరార్థమేమిటి? దైవత్వము నీయందే ఉన్నది. అంతర్దృష్టికి మాత్రమే అది గోచరమవుతుంది. సర్వమూ మనిషియందే ఉన్నది. ఈ విశ్వమంతయు దైవస్వరూపమే. విశ్వమే భగవంతుని విరాట్స్వరూపం. ఈ సత్యాన్ని గుర్తించుకోలేని వ్యక్తి ఎన్ని తపములు, ఎన్ని జపములు, ఎన్ని యాగములు చేసినా అన్నీ నిరుపయోగమే. దైవాన్ని అనేకమంది అనేకరీతులుగా వర్ణిస్తుంటారు. కాని, ఈ వర్ణనలన్నీ వారివారి మనో కల్పితములేగాని, దైవానికి సంబంధించినవి కావు. భగవత్తత్త్వము 'ఇట్టిది, అట్టిది' అని ఎవ్వరూ వర్ణించలేరు. త్యాగరాజుకూడా చెప్పాడు, "అణువునుండి ఘనము వరకు నిండియున్నది నీవే! ఇటువంటి నీ తత్త్వమును కనుగొన ఎవరి తరము స్వామీ! నీ శక్తిని తెలుసుకొన ఎవరి తరము! నీ గుణములు వర్ణింప ఎవరి తరము స్వామీ! నీ మహిమను కనుగొన ఎవరి తరము!" నీటిలో గొంతువరకు దిగిన తరువాతకూడా ఏదైనా మాట్లాడటానికి వీలౌతుందిగాని, పూర్తిగా మునిగినవాడు ఏమీ మాట్లాడలేడు. అదేరీతిగా, భగవత్తత్త్వమును పూర్తిగా గుర్తించినవాడు ఏమీ చెప్పలేడు. భగవత్తత్త్వమును అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే బదులు అనుభవించి ఆనందించడం అతి సులభమైనది. అంతకంటే సులభమైన మార్గము ఈ ప్రపంచంలో మరొకటి లేదు.

sri sathyasai vahamrutam

**నిన్ను నీవు తెలుసుకో!**

త్యాగమంటే ఏమిటి? నీకున్నటువంటి ధనమును త్యాగం చేయడమా? కాదు. నీవు త్యాగము చేయవలసినది ఆశ ఒక్కటే. ఆశ నొక్కదానిని వదలిపెడితే ఏవిధమైన బాధలూ ఉండవు. లౌకికమైన సంబంధ బాంధవ్యాలన్నీ కదలిపోయే మేఘాలవంటివి. 'లైఫ్' ఈనాడు ఉండవచ్చును, రేపు 'లైఫ్' పోవచ్చును. కుమారుడు ఈనాడు ఉండవచ్చును, రేపు పోవచ్చును. ఈ సంబంధ బాంధవ్యాలన్నీ సినిమాలో బొమ్మల మాదిరి వస్తుంటాయి, పోతుంటాయి. జనన మంటే ఏమిటి? మరణమంటే ఏమిటి? రెండూ సమానమే. ఎందుకంటే, జననము ఏవిధంగా వస్తుందో మరణముకూడా ఆవిధంగా వస్తుంది. కనుక, ఏదానినీ నీవు నమ్మరాదు. నిన్ను నీవు నమ్మాలి. 'నేను ఉన్నాను', 'నేను చూస్తున్నాను', 'నేను విన్నాను', 'నేను తిన్నాను', అని అంటున్నావు. ఈ 'నేను' ఎవరో తెలుసుకోవాలి. నీవు పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్నావు; పిహెచ్.డి. చేస్తున్నావు. కాని, ఎంత పెద్ద చదువు చదివినప్పటికీ 'ఎవరండీ మీరు? ఎక్కడి నుండి వచ్చారు?' అని ఎదుటి వారిని ప్రశ్నిస్తున్నావేగాని, 'నేనెవరిని? ఎక్కడినుండి వచ్చాను?' అని నిన్ను నీవు ప్రశ్నించుకుంటున్నావా? 'నేను' ఎవరో తెలుసుకోకుండా 'నీవెవరు? నీవెవరు?' అని అంటుంటే ప్రయోజనమేమిటి? ప్రతి మానవుడు తన తత్త్వమును తాను గుర్తించాలి.

**మంచిని స్వీకరించాలి, చెడును విసర్జించాలి**

ఆకాశంలో మేఘాలు అడ్డు వచ్చినప్పుడు చంద్రుడు కనిపించడు. కొంతసేపు ఓపికపడితే మేఘాలు కదలిపోయి మళ్ళీ చంద్రుడు కనిపిస్తాడు. అదేరీతిగా, మీయందు ఆవిర్భవించే కోప, తాపములు, అసూయ, డంబము మొదలైన 'మేఘాలు' మీరు కొంతసేపు ఓపిక పడితే కదలిపోతాయి. కాని, ఆ ఓపిక మీలో లేదు. అన్నింటికీ తొందరే! తొందరపాటు అనర్థానికి దారి తీస్తుంది. Haste makes waste, waste makes worry. So, do not be in a hurry. తన తత్త్వమును తాను గుర్తించుకోలేకపోవడంచేతనే మానవుణ్ణి worry (చింత) అనేది దహించివేస్తున్నది.

sri sathyasai vahini amrutam

ప్రేమస్వరూపులారా! మీయందు ఏవో చెడు తలంపులు రావచ్చు. చెడు తలంపు వస్తే దానివైపు చూడకండి. మంచి తలంపులను అభివృద్ధి చేసుకోండి. అప్పుడు చెడు తలంపులు వెనుకకు పోతాయి. మంచిని స్వీకరించాలి, చెడును విసర్జించాలి. ఈవిధమైన సాధన చేస్తే మీరు ఎంతైనా గుణవంతులు కాగలరు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను దూరం గావించుకున్నప్పుడే మానవుడు మహనీయునిగా రూపొందగలడు. అమితమైన కోరికలు కలిగినవాడు నిజంగా మానవుడే కాడు. భగవత్సంబంధమైన ఒకే ఒక్క కోరిక కలిగినవాడే మానవుడు. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. ఇలాంటి దుర్లభమైన మానవజన్మను పొంది పశువుకంటే హీనంగా ప్రవర్తిస్తున్నాడు, ఈనాటి మానవుడు.

**'నా' అనే భ్రాంతియే సర్వబాధలకు మూలం**

ముఖ్యంగా, మీరు సంకల్పాలను అరికట్టుకోవాలి. వాటిని ఇష్టమొచ్చినట్లు పోనీయకూడదు. ఎవరిపైనకూడా అసూయ, క్రోధము మొదలైన చెడు భావములు కలుగకూడదు. అరిషడ్వర్గములను అణచివేసినప్పుడే మీరు నిజమైన మానవులుగా జీవించగలరు. వివాహం చేసుకోండి, కుటుంబాన్ని పోషించుకోండి. తప్పు లేదు. కాని, 'నావారు, పరాయివారు' అనే భేదభావాన్ని విడిచిపెట్టండి. 'నా' అనే భ్రాంతియే సర్వబాధలకు మూలం. 'మనసు' అనే పదములో 'మ' (మాయ) అనేదానిని 'న' (అంటే) తీసివేసి, 'సు' అనేదానిని పెట్టుకోండి. 'సు' అనగా సుగంధము, సుప్రియము. భగవంతుడు సుఖస్వరూపుడు, సుగంధస్వరూపుడు, సుప్రియమైనవాడు. కాబట్టి, మీరు 'సు' (పవిత్రత) అనేదానిని మీలో చేర్చుకోండి. అప్పుడే మీరు నిజమైన మానవు లవుతారు. మీరు మానవులై పుట్టి, మానవులనిపించుకొని 'నా' అనే భ్రాంతితో జీవితాన్ని గడిపితే ప్రయోజనమేమిటి? 'నా' అనుకునేదంతా మాయనే. 'నా' అనేది సర్వమును నాశనము చేస్తుంది. 'సు' అనేది సుఖాన్ని, శుభాన్ని అందిస్తుంది. మీరు ఎన్ని డిగ్రీలు సంపాదించినా, మీవద్ద ఎంత ధనముండినా, ఎంత బలముండినా పవిత్రత లేకపోతే అన్నీ వ్యర్థమే. మీరు ఏ చదువు చదివినా, ఎంత ధనము సంపాదించినా కట్టకడపటికి ఏదీ మీవెంట రాదు. "అడవులందున్న ఆకసమున నున్న పట్టణముననున్న పల్లెనున్న గుట్ట మీదనున్న నట్టేట

srisathyasaivachanamrutam

పడియున్న... ఎక్కడున్నప్పటికీ మిమ్మల్ని రక్షించేవాడు భగవంతుడొక్కడే!" కనుక, భగవంతుణ్ణి ఆశ్రయించండి. మీరు చదవవలసింది చదవండి, లౌకిక విద్యలను నేర్చుకోండి. కాని, పరవిద్యను మాత్రం మరువకండి. దానిని విస్మరించి ఎన్ని విద్యలు నేర్చినా ప్రయోజనం లేదు.

**మీరు అనుభవించే మంచిచెడ్డలన్నీ మీనుండి ఆవిర్భవించినవే!**

ఆకాశంలో ప్రకాశించే సూర్య, చంద్రులకు మేఘాలు అడ్డు వస్తుంటాయి, పోతుంటాయి. మీరు అనుభవించే సుఖదుఃఖములు కదలిపోయే మేఘాల వంటివి. ఇలాంటి మేఘాలను నమ్ముకొని మేధస్సును దుర్వినియోగం చేసుకోకూడదు. మీ మేధస్సును సద్వినియోగపరచుకొని మీరు మహనీయులు కండి, ఆదర్శప్రాయులు కండి. అప్పుడే మీరు చదివిన చదువు సార్థకమవుతుంది. మంచిభావాలతో మంచి మాటలు మాట్లాడండి. కఠినమైన పదాలను ఉపయోగ పెట్టకండి. మృదుమధురంగా మాట్లాడండి. ఎదుటి వ్యక్తిని మీరు 'ఛో' అని కసురుకుంటే అతని మనస్సు ముక్కలౌతుంది. మీ మనస్సును మీరు మంచిగా పెట్టుకున్నప్పుడే ఇతరుల మనస్సును సంతోషపెట్టినవారవుతారు. మీరు ప్రశాంతంగా ఉన్నప్పుడే మీ చుట్టూ ఉన్నవారు ప్రశాంతంగా ఉండగలరు. మీరు అశాంతిగా ఉంటే మీచుట్టూ ఉన్నవారినికూడా అశాంతికి గురిచేస్తారు. అందరినీ సుఖపెట్టాలంటే, దేశమంతా ప్రశాంతంగా ఉండాలంటే మొట్టమొదట మీరు ప్రశాంతంగా ఉండండి. మీరు peaceful గా ఉంటే ప్రపంచమంతా peaceful గా ఉంటుంది. సుఖ సంతోషములు మీయందే ఉన్నవిగాని, బయట లేవు. మీలో మాలిన్యమును చేర్చుకుంటే మీకు ప్రపంచమంతా మాలిన్యంగానే కనిపిస్తుంది. 'యద్భావం తద్భవతి'. మీరు అనుభవించే మంచిచెడ్డలన్నీ మీ నుండి ఆవిర్భవించినవే. భగవంతునికి దీనితో ఏమీ సంబంధం లేదు. భగవంతుడు ఇందులో ఏమాత్రము ప్రవేశించడు. చెడ్డ మీదే, మంచి మీదే. కాబట్టి, భగవంతునిపై నిందవేయకూడదు. భగవంతుడు నిర్మల, నిశ్చల, నిస్వార్థ ప్రేమస్వరూపుడు, శాంత స్వభావుడు. కాబట్టి, మీరుకూడా ప్రేమను, శాంతిని పెంచుకోండి. ఎలాంటి సమయమునందైనా, ఎలాంటి పరిస్థితియందైనా మీరు శాంతంగా ఉండాలి. అప్పుడు తప్పక మీ చుట్టూకూడా శాంతి ఏర్పడుతుంది.



srisathyasaivachanamrutam

**"ధనధాన్యముల్ గల్గి ధర్మగుణంబున్న**
**సంతతి లేదనే చింత యుండు**
**విద్యాధికారియై విర్రవీగుచునున్న**
**ఉద్యోగములు లేక వెతలనొందు"**

ధనము, సుఖము మనవి కావు. వాటికై మనం ఆశ పడకూడదు. మన కర్తవ్య కర్మలను మనం సక్రమంగా నిర్వర్తించాలి. ఐతే, ఏ పని చేసినా 'ఇది భగవత్ప్రీత్యర్థం చేస్తున్నాను', అనే భావన మనయందు దృఢముగా ఉన్నప్పుడు ఏనాడూ మనకు కష్టనష్టములు కలుగవు.

**పాండవుల మహా ప్రస్థానం**

కుంతీదేవి పాండురాణిగా ఉండినప్పుడు ఆమెకు ఏవిధమైన చింతలూ లేవు. ఎప్పుడు పాండురాజు మరణించాడో అప్పటినుండి ఆమెకు కష్టాలు ప్రారంభ మైనాయి. కుమారులకోసం బాధపడింది, కోడలికోసం బాధపడింది. వాళ్ళు అడవులకు పోవడం, అవస్థలు పొందటం... ఇవన్నీ ఒకదానిపై ఒకటి ఆమెను బాధపెడుతూ వచ్చాయి. అయితే, కృష్ణ పరమాత్మునిపై గల అచంచలమైన భక్తి, విశ్వాసములవలన ఆమె కష్టాలకు క్రుంగిపోకుండా సమచిత్తముతో కాలము గడుపుతూ వచ్చింది. కృష్ణ పరమాత్మ పాండవులను అన్నివిధాలుగా కాపాడుతూ వచ్చాడు. కట్టకడపటికి, కృష్ణుడు తన అవతారం చాలించినప్పుడు అర్జునుడు ద్వారకలోని స్త్రీలను వెంటపెట్టుకొని హస్తినకు బయలుదేరాడు. దారిలో వారిని ఆటవికులు చుట్టుముట్టగా అర్జునుడు తన గాండీవమునుకూడా ఎత్తలేక, 'అయ్యో, ఈనాడు నా బలం ఎక్కడికి పోయింది?' అని ఆక్రోశించాడు. "ఆ బలం నాది కాదు, కృష్ణునిదే! ఆనాడు కృష్ణుడే గాండీవమును పట్టుకొని నాచేత యుద్ధం చేయించాడు" అని అతడు గుర్తించాడు.

హస్తినలో కుంతీదేవి అర్జునుని రాకకోసం ఎదురు చూస్తోంది. కృష్ణుని క్షేమ సమాచారం తెలుసుకోవాలని ఆమె ఆరాటపడుతోంది. అర్జునుని చూడగానే ఆమె, 'నాయనా! కృష్ణుడు బాగున్నాడా?' అని అడిగింది. 'ఇంకెక్కడి కృష్ణుడమ్మా!' అంటూ అర్జునుడు కూలబడ్డాడు. ఆ మాట విన్న తక్షణమే కుంతీదేవి కృష్ణుని వెతకడానికి వెళ్లినట్లుగా కన్నుమూసింది.

sri sathyasai vahanamrutam

## తేదీ 24.02.2006, సాయికుల్వంత్ హాలు

ధర్మజుడు తల్లికి అంత్యక్రియలు నిర్వర్తించాడు. మనుమడైన పరీక్షిత్తుకు పట్టాభిషేకం జరిపించాడు. ఆ తరువాత తన నలుగురు సోదరులు, ద్రౌపది వెంట రాగా హిమాలయాలకు బయలుదేరాడు. ధర్మజుడు ముందు నడుస్తుండగా వారతనిని అనుసరించారు. మార్గమధ్యంలో ఒకరి తరువాత ఒకరు శరీరము విడిచారు. కట్టకడపటికి ధర్మజుని వెంట ఒక చిన్న కుక్కపిల్ల మిగిలింది. ఇంద్రుడు స్వర్గద్వారముదగ్గర నిలబడి ధర్మజుని లోపలికి ఆహ్వానించాడు. 'నన్ను అనుసరించి వచ్చిన కుక్కపిల్లనుకూడా అనుమతిస్తే నేను వస్తాను' అన్నాడు ధర్మజుడు. అతని దృష్టిలో సర్వజీవులూ సమానమే. ధర్మజుని ధర్మనిరతికి సంతసించి శునక రూపములో ఉన్న యమధర్మరాజు నిజరూపము దాల్చినాడు.

తరువాత, ధర్మజుడు నరకమును సందర్శించాడు. అక్కడికి పోయి పది నిమిషములున్నాడో లేదో, అక్కడ బాధల ననుభవిస్తున్న జీవులకు ఎంతో హాయి కలిగింది. వారి వేదన మటుమాయమైంది. వారు ఆనందంతో ఉప్పొంగిపోయి, 'ధర్మజా! మీరిక్కడే ఉండిపోయి మాకు సుఖాన్ని అందించండి', అని ప్రార్థించారు. అప్పుడు ధర్మజుడు, 'నేను కాదు మిమ్మల్ని రక్షించేది. 'ధర్మో రక్షతి రక్షితః' ధర్మమును రక్షించినవారిని ధర్మమే రక్షిస్తుంది', అని చెప్పాడు.

ధర్మరాజు ఎటువంటి పరిస్థితిలోనూ ధర్మమును తప్పనివాడగుటచేత సార్థక నామధేయుడైనాడు. నేటి మానవులు 'నేను ప్రహ్లాదుణ్ణి', 'నేను రాముణ్ణి', అని చెప్పుకుంటున్నారు. పేర్లు పెట్టుకున్నంత మాత్రమున సరిపోదు. ఆ పేర్లకు తగిన గుణములు హృదయమునందు ఉంచుకొని సార్థక నామధేయులు కావాలి.

**(తేదీ 24.02.2006, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vachanamrutam